జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 30-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 714 పేజీలు: 4 వెల : రూ.7





* దయనీయ స్థితిలో కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి
* సరిపడ వైద్యులు, సిబ్బంది లేక.. గిరిజనులకు అందని వైద్యసేవలు
* నెలకోసారి సమావేశం కాగితాలకే పరిమితం
* వైద్యుల కొరతపై స్పందించని పాలకులు, అధికారులు





# చైర్మన్ గారు.. కొత్తూరు సీహెచ్‌సీని.. పట్టించుకోరూ...!



కొత్తూరు, జూన్ 29 (వార్త): ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు లేకపోతే రోగులకు వైద్యసేవలు అందేది ఎలా? ఆసుపత్రి భవనం ఉన్నా ప్రయోజనం ఏమిటి? ఇదే ప్రశ్న ఇప్పుడు కొత్తూరు మండల ప్రజల నుంచి వినిపిస్తోంది. ఒడిశా రాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని, చుట్టుపక్కల గిరిజన గ్రామాలకు ఏకైక వైద్య కేంద్రంగా నిలిచిన కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రస్తుతం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరత ఉంది. రోజూ 150 నుంచి 300 మంది వరకు రోగులు చికిత్స కోసం వచ్చే ఈ ఆస్పత్రిలో అవసరమైన వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రిలో జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, అనస్తీషియా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు తగిన సంఖ్యలో స్టాఫ్ నర్సులు కూడా లేకపోవడం వల్ల రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. గర్భిణులు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులు, ప్రమాద బాధితులు మెరుగైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఒకవైపు సరిహద్దు ప్రాంతాలు, మరోవైపు దట్టమైన గిరిజన గ్రామాల ప్రజలందరికీ ఈ ఆస్పత్రే ప్రధాన ఆధారం. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో డాక్టర్ ధర్మాన కిషోర్ కుమార్ ఒక్కరే వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందిస్తూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకే ఒక్క వైద్యుడిపై మొత్తం ఆస్పత్రి భారం పడటంతో సేవలపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. "ఆయన కూడా లేకపోతే ఈ దవాఖానకు తాళాలు వేయాల్సిన పరిస్థితి వస్తుంది" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క వైద్యుడితో ఇంత పెద్ద పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ఎంత కష్టమో అధికారులు గుర్తించాలని వారు కోరుతున్నారు. గతంలో ఈ ప్రాంతనికి మంజూరైన హాస్పిటల్ వేరే ప్రాంతానికి వెళ్ళిపోయిందని అప్పట్లో ఆస్పత్రి అంశంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన నాయకులు, ఇప్పుడు వైద్యుల కొరతపై ఎందుకని స్పందించకుండా మౌనం వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రి భవనం కోసం పోరాడిన వారు, ఇప్పుడు ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల మధ్యకు వచ్చి హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు, ఇప్పుడు ప్రజల ఆరోగ్య సమస్యలపై మౌనం ఎందుకు పాటిస్తున్నారని, జయంతి,వర్ధంతి వేడుకలకి వచ్చి రోగులకు పండ్లు, రొట్టెలు ఇచ్చి వెళ్తున్నప్పుడు నాయకులకు రోగులు పడుతున్న ఇబ్బందులు కనిపించడంలేదా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి చైర్మన్ అయిన స్థానిక ఎమ్మెల్యే ప్రతినెలా ఇక్కడ సమావేశం నిర్వహించాల్సివుంది. అయితే ఇక్కడ అటువంటిది జరగడం లేదు. సమావేశం నిర్వహించి ఉంటే ఇక్కడి సమస్యలు వారి దృష్టికి వచ్చేవని ప్రజలు అంటున్నారు. కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి కేవలం ఒక మండలానికి మాత్రమే కాదు, ఒడిశా సరిహద్దు ప్రాంతాలు, గిరిజన గ్రామాల వేలాది మంది ప్రజలకు ప్రాణాధారం. అలాంటి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను తక్షణమే భర్తీ చేసి, అవసరమైన నర్సింగ్ సిబ్బందిని నియమించడం ప్రభుత్వ బాధ్యత అని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం రాజకీయాలకు అతీతమని గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని స్థానికులు, రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.




* శిథిలావస్థకు చేరుకుంటున్న వారసత్వ సంపద
* పురావస్తుశాఖ స్వాధీనం చేసుకోవాలని కోరుతున్న ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ
* పీజీఆర్ఎస్‌లో వినతిని అందజేసిన పరిరక్షణ కమిటీ



# ప్రాచీన బుద్ధ, జైన కట్టడాలు.. కనుమరుగు!

మందస, జూన్ 29(వార్త): అలనాటి మంజూష సంస్థానం నేడు మందస మండలంగా మారింది. రాజులు, జమీందారుల హయాంలో మంజూషగా ఈ ప్రాంతంలో విరాజిల్లింది. మంజూష అంటే ఆభరణాల పెట్టె అని అర్థం. అటువంటి మంజూష ప్రాంతంలో చారిత్రాత్మక కట్టడాలు, నిర్మాణాలు నేటికీ సజీవ సాక్ష్యాలుగా మిగిలిఉన్నాయి. వీటికి సంరక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు కొన్ని చేరుకోగా.. మరికొన్ని కనుమరుగవుతున్నాయి. మందస ప్రాంతంలోని బౌద్ధ, జైన సంప్రదాయ కట్టడాలు, పురాతన నిర్మాణాలను పరిరక్షించుకోవడానికి ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ ముందుకు వచ్చింది. చారిత్రాత్మక కట్టడాలు పురావస్తుశాఖ స్వాధీనం చేసుకోవాలని కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు. ఈ మేరకు మందస తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. మందసలోని ప్రాచీన బౌద్ధ, జైన కట్టడాలను హెరిటేజ్ సైట్‌గా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. మందస మండల కేంద్రంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ, జైన సంప్రదాయాల కట్టడాలను పురావస్తు శాఖ స్వాధీనం చేసుకుని, రక్షిత కట్టడాలుగా (హెరిటేజ్ సైట్) ప్రకటించాలని ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో గ్రీవెన్స్ అధికారిణి (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) ఇందిరకు కమిటీ సభ్యులు ఒక వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్, రచయిత మామిడి కోదండరావు మాట్లాడుతూ... మందస పట్టణ పరిసరాల్లోని ఆనందగిరిమెట్ట, గోవర్ధనగిరిమెట్ట ప్రాంతాలలో ఆదిమ వాసుల శిలాశ్రయాలు, బౌద్ధ, జైన సంప్రదాయాలకు చెందిన ప్రాచీన నిర్మాణాలు నేటికీ సజీవంగా ఉన్నాయని తెలిపారు. గోవిందగిరి మెట్టపై శిలపై చెక్కిన పాదాల గుర్తులు, ఆనందగిరి మెట్టపై శిలాశ్రయాలు, ప్రాచీన ఇటుకలతో కూడిన చతురస్రపు పునాదులు నాటి జైన చైత్యాల నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ అత్యంత అరుదైన పలక ఇటుకల నిర్మాణాలు, శిథిలావస్థకు చేరిన దీపపు గూళ్లు ఉన్నాయని, ప్రభుత్వం ఇక్కడ తవ్వకాలు జరిపి నాటి ఈ నేల ప్రాచీన చరిత్రను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కమిటీ ప్రతినిధి పురుషోత్తం బెహరా మాట్లాడుతూ... మందస పట్టణం చివరన ఉన్న వాసుదేవ ఆలయం పక్కన, అష్ట శంభు లక్నేశ్వర ఆలయ ముఖద్వారానికి ఉత్తరం వైపున(గోపాల్ సాగర్ సమీపంలో) ఒక చారిత్రక గోడ ఉందని, దానిపై జైన సాంప్రదాయానికి చెందిన, వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన 23వ తీర్థంకరుడైన "పార్శ్వనాథుని" విగ్రహం చెక్కబడి ఉందని తెలిపారు. అయితే, ఇటీవల గోపాల్ సాగర్ ఆధునీకరణ పనుల పేరుతో ఆ విగ్రహం ముందున్న పురాతన మండపాన్ని తొలగించారని, ఆ సమయంలో అమూల్యమైన శిలాశాసనాలు ధ్వంసమవ్వడం మన ప్రాంతీయ చరిత్రకు, సంస్కృతికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుడు నిరంజన్ బెహరా మాట్లాడుతూ... ప్రభుత్వం, పురావస్తుశాఖ వెంటనే జోక్యం చేసుకుని మిగిలివున్న ప్రాచీన కట్టడాలను, జైన విగ్రహాన్ని కాపాడాలని కోరారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, సమగ్ర పరిశోధనలు జరిపి మన పూర్వీకుల వారసత్వ సంపదను, చారిత్రక ఆధారాలను రక్షించాల్సిన అందరిపై ఉందన్నారు. పురావస్తు శాఖ అధికారిక తవ్వకాలు జరిపి ఈ ప్రాంతాన్ని 'హెరిటేజ్ సైట్'గా ప్రకటించాలని కమిటీ సభ్యుడు గయా సంతు డిమాండ్ చేశారు. వినతి పత్రం స్వీకరించిన అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(గ్రీవెన్స్ అధికారిణి) ఇందిర మాట్లాడుతూ... ప్రాచీన కట్టడాలను, చారిత్రక సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కమిటీ సభ్యులు సమర్పించిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, ఈ చారిత్రక కట్టడాల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## తర్లాకోట పెద్ద చెరువు గట్టు ఆక్రమణ

* గట్టుపై మద్యం షాపు
* అధికార పార్టీ నేతల అండదండలతోనే ఈ షాపు ఏర్పాటు
* చోద్యం చూస్తున్న అధికారులు



పలాస, జూన్ 29 (వార్త): సామాన్యుడికి ఒక న్యాయమా... రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తికి ఒక న్యాయమా అంటూ గ్రామస్తులు వాపోతున్నారు. వీరభద్రపురంలో ఒక నిరుపేద అభాగ్యురాలు ఇల్లు నిర్మాణానికి ప్రయత్నిస్తే రాత్రికి రాత్రే ఎటువంటి నోటీసులు లేకుండా ఆఘమేఘాలపై ఇల్లు కూల్చివేసిన అధికారులకు.. తర్లకోట గ్రామంలో ఉన్న చెరువుగట్టుపై అక్రమ నిర్మాణం కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. పలాస మండలంలోని తర్లాకోట గ్రామంలో ఉన్న పెద్దచెరువు గట్టు ఆక్రమణకు గురవుతోంది. చెరువుగట్టుపై అక్రమంగా మద్యం షాపు ఏర్పడింది. సదరు వ్యక్తికి రాజకీయ నేతలు అండదండలు ఉండడంతో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మౌనం వీడి చెరువు గట్టును పరిరక్షించే చర్యలు చేపట్టాలని లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

## భర్త చితికి తలకొరివి పెట్టిన భార్య

పలాస, జూన్ 29 (వార్త): పలాస పట్టణంలోని జగన్ అన్నా కాలనీలో భర్త చితికి భార్య తలకొరివి పెట్టిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన నెయ్యిల ఉమా మహేశ్వరరావు (56) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు. సోమవారం నిర్వహించిన అంత్యక్రియలకు బంధుమిత్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఉమా మహేశ్వర రావుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన భార్య నెయ్యిల సరస్వతి, హిందూ సంప్రదాయాల ప్రకారం భర్తకు తలకొరివి పెట్టి చివరి కర్తవ్యాన్ని నిర్వర్తించారు.



## శ్రీకాకుళం

## 20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం



**సోంపేట, జూన్ 29(వార్త):** మాకన్నపురం పంచాయతీ శారదాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు 20 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ నిర్మాణాన్ని సోమవారం చేపట్టారు. కంచిలి ఏఎంసీ చైర్ పర్సన్ మద్దిల విజయలక్ష్మి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అభివృద్ధి చేయలేని పార్టీలు విమర్శలతో కాలం గడుపుతున్నాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, బతకల జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకం



**సోంపేట, జూన్ 29(వార్త):** బేసి రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సోంపేటకు చెందిన రైల్వే ఇంజనీరు టీ.తరిణయ్య దంపతులు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదివేల రూపాయల నగదు ప్రోత్సాహకాలను, మెమొంటోలను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పావనికి 5000 రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రవీణ్ కు మూడు వేల రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన నిర్మలకు ?2,000 అందజేశారు. ఈ సందర్భంగా తరిణయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ పట్టుదలతో, క్రమశిక్షణతో చక్కగా చదువుల్లో రాణించి ఉత్తమమైన భవిష్యత్తు నిర్మాణానికి ఇప్పటినుంచే కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సీమయ్య ఆధ్వర్యంలో తరిణయ్య దంపతులకు సన్మానం చేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే
## పోరాటాలకు సిద్ధం



**పలాస, జూన్ 29 (వార్త):** సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటానికి సిద్ధమని మున్సిపల్ కార్మికులు కమీషనర్ శ్రీనివాస్ కు నోటీసు అందజేశారు. 2011-12 సంవత్సరాల 20 నెలల పి యఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలలో జామచేయకుండా జాప్యం చేస్తూ ఉన్నారని, ఇప్పుడు ఆ డబ్బులులో 24 లక్షలు మాయం చేసేశారని, ఈ సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. జూలై 5 వ తేది లోగా పరిష్కారం చేయకపోతే జూలై 6 నుండి పోరుబాట తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి, మున్సిపల్ యూనియన్ నాయకులు కె వెంకటి, బి కుర్మారావు, యస్ రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంపుపై
## ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- ఏకోపాధ్యాయ పాఠశాలలను పరిశీలించిన ఎంఈఓ ఉప్పాడ శాంతారావు**

**-మౌలిక వసతుల కల్పనకు అధికారులకు ఆదేశాలు**

**నరసన్నపేట, జూన్ 29(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు సూచించారు. సోమవారం నరసన్నపేట మండలం తామరపల్లి పంచాయతీ పరిధిలోని గెడ్డయ్యపేట, శివరాంపురం ఏకోపాధ్యాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల హాజరు వివరాలు, బోధనా విధానం, మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం గెడ్డయ్యపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు, శివరాంపురం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. గ్రామాల్లోని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత తదితర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థుల నమోదు పెంపుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు పేర్కొన్నారు.



# నైతల



**- ఏడాది కాలంగా నిలిచిపోయిన నౌతల ఎత్తిపోతల పథకం**

**-ట్రాన్స్‌ఫార్మర్ చోరీతో ఏడాదిగా నిలిచిన సాగునీటి సరఫరా**

**- నాలుగు గ్రామాల రైతులకు తీవ్ర ఇబ్బందులు**

**-సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినతి**

**(సారవకోట)**

సారవకోట మండలంలోని నౌతల ఎత్తిపోతల పథకం ఏడాదికిపైగా పనిచేయక పోవడంతో ఆ పరిధిలోని రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఏడాది క్రితం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. అప్పటి నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పథకం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మాలువ, సవర మాలువ, నౌతల, కళ్లట గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కొరత కారణంగా పంటల సాగు దెబ్బ తింటోందని, ప్రత్యామ్నాయంగా బోర్లపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు తెలిపారు. దీంతో సాగు వ్యయం పెరగడంతో పాటు పంటల దిగుబడులపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యపై నోడల్ అధికారి తిలక్‌ను వివరణ కోరగా, ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే మరమ్మ తులు చేసి తిరిగి పనిచేసేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని పునరుద్ధరించాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



## శ్రీజగన్నాథస్వామి ఆలయంలో..
## వైభవంగా దేవస్నాన పౌర్ణమి వేడుకలు

**-సంస్కృతి, సంప్రదాయాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు**

**మందస, జూన్ 29(వార్త):** మందసలోని శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో 'దేవస్నాన పౌర్ణమి' వేడుకలు వైభవంగా జరిగాయి. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో సోమవారం 'దేవస్నాన పౌర్ణమి' వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జగన్నాథుని భక్తులు ఎంతో విశేషంగా జరుపుకొనే ఈ ఉత్సవం మందసలో కన్నుల పండువగా సాగింది. ఆలయ సంప్రదాయం ప్రకారం, ఈ దేవస్నాన పౌర్ణమిన స్వామివారికి నిర్వహించే పవిత్ర స్నాన ఘట్టం అనంతరం ఆయనకు జ్వరం వస్తుందని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా స్వామివారికి సోమవారం నుండి 14రోజుల పాటు ఏకాంతంగా(అనవసర వ్యవధి) విశ్రాంతి తీసుకుంటారు. ఈ విశ్రాంతి అనంతరం, జూలై 16వ తేదీన జరిగే సుప్రసిద్ధ 'రథయాత్ర' కోసం స్వామివారు సిద్ధమై, తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. మందసలోని ఈ చారిత్రక శ్రీ జగన్నాథ స్వామి ఆలయాన్ని ప్రతిష్టాత్మక 'మంజూష జమిందారీ' కుటుంబం వారు నిర్మించారు. కాలక్రమంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆ సమయంలో స్వామివారి భక్తులంతా ఏకమై, ఆలయ పునర్నిర్మాణ బాధ్యతలను తమ భుజాలపై వేసుకున్నారు. భక్తుల విశేష కృషితో 2002వ సంవత్సరంలో ఈ ఆలయం తిరిగి పూర్తి స్థాయిలో నిర్మితమై, పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. అప్పటి నుండి నేటి వరకు ఆలయంలోని ప్రతి కార్యక్రమాన్ని, ఆచార వ్యవహారాలను మంజూష జమిందారీ కుటుంబం, భక్తుల ఆధ్వర్యంలో అత్యంత నిష్టగా, వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. దేవస్నాన పౌర్ణమి వేడుకలలో మందస పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విశేషంగా ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులతో పాటు 'ఒరియా యంగ్ మెన్స్ లైబ్రరీ' సభ్యులు, 'ఒరియా బ్రాహ్మణ సంఘం' సభ్యులు చురుకుగా పాల్గొని స్వామివారి సేవలో తరించి, ఆశీస్సులు పొందారు.

## పేదలు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం

**-న్యాయవాది లేక జైలులో ఉన్న ముద్దాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**- ప్యానల్ అడ్వకేట్లకు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వాణి సూచన**




**నరసన్నపేట, జూన్ 29 (వార్త):** నిరుపేదలు, మహిళలకు సత్వర న్యాయం అందేలా ఉచిత న్యాయ సహాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వాణి సూచించారు. సోమవారం నరసన్నపేట మెజిస్ట్రేట్ కార్యాలయంలో ప్యానల్ అడ్వకేట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయ సేవలు పొందలేకపోతున్న పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడం న్యాయవాదుల బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన కేసులను ప్రాధాన్యతతో స్వీకరించి, వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. మహిళల హక్కుల పరిరక్షణలో ప్యానల్ అడ్వకేట్లు కీలక పాత్ర పోషించాలని అన్నారు. అదేవిధంగా, న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే స్థోమత లేక పలువురు ముద్దాయిలు జైళ్లలోనే ఉండిపోతున్నారని, అలాంటి వారి వివరాలను గుర్తించి వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందేలా ప్యానల్ అడ్వకేట్లు చొరవ తీసుకోవాలని, న్యాయ సేవా సంస్థల లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో ప్యానల్ అడ్వకేట్లు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అపురూపం.. వాసుదేవుని దివ్యస్వరూపం

**- వైభవంగా స్వామివారి అభిషేకాలు**

**మందస, జూన్ 29(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని దివ్యమంగళ స్వరూపం భక్తులను భక్తితన్మయత్వానికి తీసుకెళ్లింది. స్వామి జన్మతిథి నక్షత్రమైన మూలా నక్షత్రం సోమవారం కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమ, క్షీర, చందన, జలాభిషేకాలు అనంతరం స్వామి నిజరూప దర్శనానికి భక్తులకు అనుమతించారు. మూలానక్షత్రం రోజున భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. అభిషేకాలు, నిజరూపదర్శనం అనంతరం వాసుదేవునికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక అలంకరణలో వాసుదేవుని తిరుమల-తిరుపతిలోని శ్రీవెంకటేశ్వరస్వామిలా కనిపించడంతో భక్తులు గోవిందా.. వాసుదేవా.. అంటూ భక్తితో స్వామివారిని కొలిచారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.



## ఓటరు జాబితాలో లోటుపాట్లు ఉంటే తెలపాలి

**- రాజకీయ ప్రతినిధులతో సమీక్ష సమావేశంలో ఈఆర్‌వో జయదేవి**

**- ఓటరు నమోదులో నిబంధనలు పాటించాలని సూచన**



**నరసన్నపేట, జూన్ 29(వార్త):** ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు, అభ్యంతరాలు లేదా సవరణలు అవసరమైతే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌వో) బి. జయదేవి సూచించారు. సోమవారం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితా రూపొందించే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను గుర్తిస్తే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటరు నమోదై ఉన్న వారి పేర్లను స్థానికంగా నమోదు చేయాలంటే ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుందని, అందువల్ల కొన్ని సాంకేతిక, పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె వివరించారు. నిబంధనల మేరకు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పిస్తే అర్హులైన వారి దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరిన ఆమె, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం నిరంతరం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## దూకులపాడు పాఠశాలలో మనబడి పనుల తనిఖీ

**- నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలి**

**- ఎంఈఓ-2 దాలినాయుడు ఆదేశం**



**నరసన్నపేట, జూన్ 29(వార్త):** నరసన్నపేట మండలం దూకులపాడు ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ--2 దాలినాయుడు సందర్శించి, పాఠశాలలో చేపడుతున్న 'మనబడి--మన భవిష్యత్తు' అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మనబడి--మన భవిష్యత్తు పనులకు సంబంధించిన నిర్వహణ వివరాలను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్ శత శాతం పూర్తి

**సోంపేట, జూన్ 29(వార్త):** కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం శత శాతం పూర్తి చేశారు. ఆదివారం అందుబాటులోకి రాని చిన్నారులకు సోమవారం ప్రత్యేకంగా వారి ఇండ్ల వద్దకు వెళ్లి వ్యాక్సినేషన్ చేశారు. పీహెచ్సీ పరిధిలో వైద్యాధికారి డాక్టర్ రోషిని ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఆయా గ్రామాల్లో పర్యటించాయి. సోంపేట,జింకిభద్ర,బెంకిలి, పలాసపురం, బేసి రామచంద్రపురం, పాలవలస, కొర్లం, బ్రాహ్మణ కొర్లాం తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం పట్ల డాక్టర్ రోషిని సిబ్బందిని అభినందించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఏరువాక సాగాలో..!


- ఏరువాక పౌర్ణమి వేడుకల్లో రైతులతో కలిసి నాగలి పట్టిన ఎమ్మెల్యే రమణమూర్తి
- కత్తిరివానిపేటలో సంప్రదాయబద్ధంగా వ్యవసాయ పనులకు శ్రీకారం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : బగ్గు



**పోలాకి, జూన్ 29 (వార్త):** కత్తిరివానిపేట గ్రామంలో సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్త వ్యవసాయ సంవత్సరానికి నాంది పలికే ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రైతులు సంప్రదాయ పద్ధతిలో భూమికి పూజలు నిర్వహించి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా భూమిపూజ నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వయంగా నాగలి పట్టి ఎద్దులతో పొలాన్ని దున్ని ఏరువాక వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రైతే రాజు -- వ్యవసాయమే దేశానికి వెన్నెముక" అనే భావనతో ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న ప్రతి రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని ఆకాంక్షించారు. రైతుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సాగునీటి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ ఒకదానికొకటి అనుబంధమని పేర్కొంటూ, ప్రకృతి సమతుల్యతను కాపాడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగ అభివృద్ధికి నిరంతరం చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నరసన్నపేట బుర్రకథ కళాకారులకు నంది అవార్డు

- శాంతారావు--రాజ్యలక్ష్మి దంపతులకు ప్రతిష్ఠాత్మక పురస్కారం
- సామాజిక, సాంస్కృతిక సేవలకు గుర్తింపుగా సత్కారం



**నరసన్నపేట, జూన్ 29(వార్త):** నరసన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారులు శాంతారావు--రాజ్యలక్ష్మి దంపతులకు ప్రతిష్ఠాత్మక నంది అవార్డు లభించింది. సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన వైభవోపేత కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు శివ ప్రసాద్ చేతుల మీదుగా శాంతారావు--రాజ్యలక్ష్మి దంపతులు నంది అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కళారంగానికి వారు చేసిన సేవలను నిర్వాహకులు కొనియాడారు. దశాబ్దాలుగా బుర్రకథ కళారూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ సామాజిక చైతన్యం కలిగించే ప్రదర్శనల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ దంపతులకు నంది అవార్డు లభించడం నరసన్నపేట ప్రాంతానికి గర్వకారణంగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా శాంతారావు, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాజీవితానికి లభించిన ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. బుర్రకథ వంటి జానపద కళారూపాలను భావితరాలకు చేరవేసేందుకు మరింత కృషి చేస్తామని చెప్పారు. నంది అవార్డు అందుకున్న శాంతారావు--రాజ్యలక్ష్మి దంపతులను పలువురు కళాకారులు, ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు, అభిమానులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐఐఐటీలో సీటు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

- నరసన్నపేట పీఎం శ్రీ పాఠశాల విద్యార్థిని ఢిల్లీశ్వరికి ఒంగోలు క్యాంపస్ కేటాయింపు
- విద్యార్థినిని అభినందించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు



**నరసన్నపేట, జూన్ 29(వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వెలమల ఢిల్లీశ్వరి ఐఐఐటీలో సీటు సాధించి పాఠశాలకు మరోసారి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 572 మార్కులు సాధించిన ఢిల్లీశ్వరి, సోమవారం విడుదలైన రెండో విడత ఐఐఐటీ ప్రవేశాల జాబితాలో ఎంపికైంది. విద్యార్థినికి ఒంగోలు ఐఐఐటీ క్యాంపస్ కేటాయించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట రూపవతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా రెండో జాబితాలో ఎన్‌సీసీ కోటా కింద మరికొన్ని సీట్లు వచ్చే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయురాలు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు సంబంధిత వివరాలను పరిశీలించాలని సూచించారు. ఐఐఐటీలో ప్రవేశం సాధించిన విద్యార్థిని వెలమల ఢిల్లీశ్వరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి, ఉన్నత విద్యలోనూ ఇదే ప్రతిభ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## శ్రీముఖలింగేశ్వరుడికి ఘనంగా మైనాకోత్సవం

- వేదమంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా ప్రత్యేక పూజలు

**జలుమూరు, జూన్ 29(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం గ్రామంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి మైనాకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక వేద పండితులు బంకుపల్లి రవిశర్మ, దేవాలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, సంప్రదాయబద్ధమైన ఆగమ శాస్త్ర విధానాలతో మైనాకోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రతి ఏడాది జ్యేష్ఠ మాస పౌర్ణమికి ముందురోజు స్వామివారికి మైనాకోత్సవాన్ని నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోందని అర్చకులు తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్య పూజలు, విశేష ఆరాధనలు కొనసాగుతున్నాయని, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## జలుమూరు మండలానికి చేరిన విద్యార్థుల యూనిఫాం క్లాత్

- 3,162 మంది విద్యార్థులకు త్వరలో పంపిణీ
- ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేపడతాం
- ఎంఈఓ-2 ప్రసాదరావు



**జలుమూరు, జూన్ 29(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాం క్లాత్ జలుమూరు మండలానికి చేరినట్లు ఎంఈఓ-2 ఎం.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) కార్యాలయానికి చేరుకున్న యూనిఫాం వస్త్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 3,162 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యూనిఫాం క్లాత్‌ను సంబంధిత పాఠశాలలకు పంపించి, త్వరలోనే విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతి విద్యా సంవత్సరంలో ఉచిత యూనిఫాంలు అందజేస్తోందని, దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా యూనిఫాం క్లాత్ పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈఓ-2 సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## సంతలబయలులో కాంగ్రెస్ నాయకుల పర్యటన

- గ్రామ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ
- శ్మశానవాటికకు దారి, తాగునీటి సమస్యలపై గ్రామస్తుల వినతి

**సారవకోట, జూన్ 29(వార్త):** నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని లింగాలపాడు పంచాయతీ సంతలబయలు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పర్యటించి గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ప్రధాన సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ స్మశానవాటికకు సరైన దారి లేకపోవడంతో అంతిమయాత్రల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అలాగే కోవెల వీధికి సరైన రహదారి లేక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని, తాగునీరు కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని వివరించారు. గ్రామస్తుల సమస్యలను విన్న నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం ప్రయత్నిస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సారవకోట చైతన్యకుమార్, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## విద్యా బోధనను పరిశీలించిన ఎంఈవో

- జలుమూరు ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన బమ్మిడి మాధవరావు
- ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో బోధనలో నాణ్యత పెరిగిందని వ్యాఖ్య

**జలుమూరు, జూన్ 29(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయుల బోధన తీరును నిరంతరం సమీక్షిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు అన్నారు. సోమవారం జలుమూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ముందుగా పాఠశాలలో నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వివిధ తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులు చేపడుతున్న విద్యాబోధనను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ (ఖీశీబఅఝఅశీఖుశ్రీ ాఱ్‌వతీఋషవ ఖఅస చీబఎవతీఋషవ) శిక్షణా కార్యక్రమాలు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా మారాయని తెలిపారు. ఆ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు మెరుగుపడే అవకాశముందని పేర్కొన్నారు. విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి అందుకు అనుగుణంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన అన్నారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత తదితర అంశాలను కూడా ఆయన పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మన ఊరు - మన జెండా

- ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ నాయకుడు పోకతోట సింహాచలం
- జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ .. శుభాకాంక్షలు వెల్లువ



**పోలాకి, జూన్ 29 (వార్త):** పోలాకి గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన ఊరు -- మన జెండా' కార్యక్రమం ఘనంగా జరిగింది. నరసన్నపేట నియోజకవర్గం ఇన్‌చార్జి, బీఎల్ఏ-1 పోకతోట సింహాచలం ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. పోలాకి మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం అవసరంపై మాట్లాడారు. ఈ సందర్భంగా పోకతోట సింహాచలం మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, ప్రజాసేవే భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోకతోట సింహాచలం జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవలో ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు భారతి, సీనియర్ నాయకులు సంపత్‌రావు, తేజేశ్వరరావు, కిషన్ మోర్చా అధ్యక్షుడు కిల్లి లక్ష్మణరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కరుకోల రామారావు, ఎండ శ్రీనివాసరావు, ప్రసాద్‌రావు, అర్జున్‌రావు, జగన్‌మోహన్‌రావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# జాతీయ ఉత్తమ పాఠశాలగా..
# జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల



- ఉపాధ్యాయుల సేవలు ఆదర్శనీయం
- సన్మాన సభలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
- జాతీయ గుర్తింపు జిల్లాకే గర్వకారణమన్న అర్చన

**జలుమూరు, జూన్ 29 (వార్త):** జలుమూరు మోడల్ ప్రైమరీ స్కూల్ (ఆదర్శ ప్రాథమిక పాఠశాల) జాతీయ స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ ఘనత సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన హాజరై ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం అభినందనీయమన్నారు. జలుమూరు పాఠశాల విజయం కేవలం మండలానికే కాకుండా నరసన్నపేట నియోజకవర్గానికి, శ్రీకాకుళం జిల్లాకు సైతం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సేవలను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల జాతీయ స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం ఉపాధ్యాయుల కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. ఈ పాఠశాల ఇతర ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. పాఠశాల జాతీయ గుర్తింపు సాధించడంలో కీలక పాత్ర పోషించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ముఖ్య అతిథులు, గ్రామ పెద్దలు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను గ్రామస్తులు కొనియాడుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## దేవాలయాల పక్కన వైన్ షాపులా?

- విద్యా సంస్థలు, ఆస్పత్రుల సమీపంలో మద్యం విక్రయాలపై స్థానికుల అభ్యంతరం
- సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి




**నరసన్నపేట, జూన్ 29(వార్త):** నరసన్నపేటలోని ప్రధాన ప్రాంతంలో దేవాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు అత్యంత సమీపంలో వైన్ షాప్ నిర్వహించడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంత వాతావరణం నెలకొనాల్సిన ప్రాంతంలో మద్యం విక్రయాలు కొనసాగడం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత వైన్ షాప్‌కు అతి సమీపంలో రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, దుర్గమ్మ ఆలయం ఉన్నాయి. అదే ప్రాంతంలో ప్రైవేట్ ఆస్పత్రి, నారాయణ స్కూల్, ఎల్‌వీఆర్ కాలేజీ, మెడికల్ షాపులు కూడా ఉండటంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో వైన్ షాప్ నిర్వహణ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు భక్తులు దేవాలయాలకు దర్శనానికి వస్తుండగా, మరోవైపు మద్యం విక్రయాలు కొనసాగడం సమాజానికి సరైన సందేశం కాదని అభిప్రాయపడుతున్నారు. విద్య, వైద్యం, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఉన్న ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని, స్థానిక పరిస్థితులు, ప్రజల అభ్యంతరాలు, సంబంధిత నిబంధనలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. "మెడికల్ షాపులు, విద్యాసంస్థలు, దేవాలయాలు ఉండాల్సిన ప్రాంతంలో వైన్ షాప్ నిర్వహించడం ఎంతవరకు సమంజసం? ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆన్‌లైన్‌లో నమోదుపై అవగాహన




**మెళియాపుట్టి, జూన్ 29(వార్త):** గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులు, గ్రామాలలో వివిధ అంశాలలో చేసిన ఖర్చులకు సంబంధించి ఆన్లైన్లో ఎలా నమోదు చేయాలి తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాడు సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తెలిపారు. పై అధికారుల ఆదేశాల మేరకు ట్రైనింగ్ ఫర్ నీడ్ అనాలసిస్ (టి ఎన్ ఎ) కార్యక్రమం పై సమావేశంలో తెలియపరచడం తోపాటు గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులు వసూలు వేగంతో చేయాలని, రానున్న వర్షాకాలం సీజన్ దృశ్య డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలలో క్లీనింగ్ చేపించాలని, పంచాయతీలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు రాకుండా సిబ్బంది చూడాలని పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు అనేకంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తోపాటు డిప్యూటీ ఎంపీడీవో అప్పయ్య, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

## తాగునీటి సదుపాయం కల్పించరూ..!

**జి.సిగడాం, జూన్ 29 (వార్త):** ఆనందపుర గ్రామానికి మంచినీటి సదుపాయం కల్పించిందంటూ సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించు గ్రీవెన్స్ లో సప్నిల్ దినకర్ పుండ్కర్ నకు గ్రామ నీటి సంఘం అధ్యక్షులు .. కలెక్టర్ చిత్తిరి తిరుపతిరావు వినత పత్రాన్ని అందించారు. మాగ్రామానికి సరైన త్రాగు నీటి సదుపాయం లేదని వాటర్ ట్యాంకు నిరుపయోకరంగా మూలకు చేరిందని నాలుగు సంవత్సరాల క్రితం మా గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ పదకంలో భాగంగా ఇంటింటికి నీరు అందిస్తామని చెప్పారు తప్ప నీటి వనరులు బోర్లు, మోటర్లు వాటర్ ట్యాంకు నిర్మాణ వసతులు గాలికి వదిలేశారని దీని వలన సుమారు 700 కుటుంబాలు మంచి నీటి కోసం నానా ఇబ్బందు పడుతున్నారని చెప్పారు. వాటర్ ట్యాంకు నిర్మాణంలో సంబదిత అదికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎం ఉపయోగం లేకుండా పోతుందన్నారు. ఈవిషయం పై కలెక్టర్ స్పందిస్తూ మీ గ్రామానికి త్వరలోనే త్రాగు నీటి కోసం చర్యలు తీసుకుంటామన్నారు.



## ఉపాధ్యాయులకు టెట్ మెటీరియల్

-యూటీఎఫ్ నాయకుల చొరవ అభినందనీయం



**మందస, జూన్ 29(వార్త):** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు హాజరవుతున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర ప్రచురణల విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన టెట్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ కార్యక్రమం సోమవారం హరిపురంలో జరిగింది. మందస మండల యూటీఎఫ్ నాయకులు స్థానిక అభ్యర్థులకు, ఉపాధ్యాయులకు ఈ మెటీరియల్స్‌ను అధికారికంగా అందజేశారు. యూటీఎఫ్ తీసుకున్న ఈ సామాజిక విద్యా చొరవపై పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు ప్రశంసల జల్లు కురిపించారు.

### సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో ..

ఈ సందర్భంగా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, జిల్లా పూర్వపు కార్యదర్శి గున్న రమేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా 'టెట్' నిబంధన తప్పనిసరి అయిందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రచురణల విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కొరకు ప్రత్యేకంగా రూపొందించిన ఈ టెట్ మెటీరియల్స్(ఒక సెట్‌లో 7 పుస్తకాలు)ను అతి తక్కువ ధరకే అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు అందించే ఎస్ఎస్సీ మోడల్ టెస్ట్ పేపర్స్ తరహాలోనే, ఈ మెటీరియల్ కూడా ఎంతో నాణ్యతతో కూడి ఉంటుందని, దీనిని చదివిన వారు ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఒకవైపు ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూనే, మరోవైపు వారికి కావలసిన మెటీరియల్స్ ప్రచురించిన ఏకైక సంఘంగా యూటీఎఫ్ నిలిచిందని వారు పేర్కొన్నారు.

### సామాజిక స్పృహకు నిదర్శనం

మండల కోశాధికారి సోమనాథ్ సిస్టు మాట్లాడుతూ... యూటీఎఫ్ అంటే కేవలం ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలపై పోరాడే సంఘం మాత్రమే కాదని, అకాడమిక్ పరంగా కూడా నిపుణులచే ఇటువంటి అత్యుత్తమ మెటీరియల్స్ రూపొందించి ఉపాధ్యాయుల మేలు కోసం శ్రమించే సామాజిక స్పృహ కలిగిన సంఘమని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ భారీ ఫీజులు చెల్లించి కోచింగ్ సెంటర్లకు వెళ్ళనవసరం లేకుండా ఉపాధ్యాయులకు మారుతున్న సిలబస్ ను అనుగుణంగా తయారుచేసిన ఈ పుస్తకాలు ఎంతో తోడ్పడతాయని వక్తలు తెలిపారు.

### విజయానికి బాటలు

ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకున్న అభ్యర్థులకు, ఉపాధ్యాయులకు అండగా నిలవడమే యూటీఎఫ్ లక్ష్యం. ఈ మెటీరియల్‌ను అందరూ సద్వినియోగం చేసుకుని, పరీక్షలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తున్నాం" అని మండల నాయకులు స్పష్టం చేశారు. నిరంతరం నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతూనే, ఇలా విద్యా సామగ్రిని అందిస్తూ యూటీఎఫ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శప్రాయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మందస మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు కాసం శ్రీనివాసరావు, గున్న రాజు, గున్న చంద్రశేఖర్, పాలిన సాయికుమార్, కుత్తం సుధాకర్ , బొడ్డు ఉపేంద్ర, బి శ్రీనివాసరావు, టి రాంప్రసాద్, బాలార్జున పాత్రో, ఎస్ శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటకు ఏమైంది..?

- అక్రమ కట్టడాలు, భూకబ్జాలు, ప్రజా సమస్యలతో ఆందోళనలో ప్రజలు
- మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**నరసన్నపేట, జూన్ 29 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో అక్రమ కట్టడాలు, భూకబ్జాలు, ప్రజా సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కొరతతో పాటు అక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు సమర్థవంతంగా స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు, చెత్త నిర్వహణ వంటి సమస్యలు చాలాకాలంగా కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యల పరిష్కారంలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలపై కూడా స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని చెబుతున్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎందుకు విఫలమవుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని, అలాగే తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యలను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించాలని స్థానికులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.





## కంకర మాఫియా పంజా!

- అక్రమంగా కంకర తవ్వకాలు
- మొగులపాడులో కొండలను తలపిస్తున్న కంకర గుట్టలు
- పట్టించుకోని అధికారులు

(పలాస)

కంకర మాఫియా పేట్రేగిపోతున్న అధికారులు మౌనం దాల్చడం.. వారి పనితీరుపై పలు అనుమానాలకు దారి తీస్తోంది. మొగులపాడు వద్ద కంకర గుట్టలు కొండను తలపిస్తున్నాయి. ఇవి రెవెన్యూ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే కనిపిస్తున్నా.. అటువైపు అధికారులు చూడటం లేదని విమర్శలు నిలువెత్తుతున్నాయి. పలాస మండలంలోని మొగులపాడు గ్రామం పరిసర ప్రాంతాల్లో కంకర మాఫియా బరితెగించినట్లు స్థాని కులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే సమీపంలోని కొండలను తవ్వి, వేలాది క్యూబిక్ మీటర్ల కంకరను ఖాళీ స్థలాల్లో భారీగా నిల్వ చేసినట్లు తెలిసింది. ఈ నిల్వలు కోట్ల రూపాయల విలువ ఉంటా యని స్థానికులు పేర్కొంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు, రవాణా, నిల్వలు అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం కొన్ని నెలలుగా కొండలను యంత్రాలతో తవ్వి కంకరను తరలించి వివిధ ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళల్లోనే కాకుండా పగటి పూట కూడా డంపర్లు, ఎక్స్‌కవేటర్లతో ఈ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రకృతి సంపద నాశనం కావడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభు త్వానికి రావాల్సిన రాయల్టీ, పన్నుల రూపంలో కోట్ల రూపాయల ఆదాయం అక్రమ తవ్వకాల వల్ల నష్టపో తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్రమంగా నిల్వ చేసిన కంకరను అవసరమైనప్పుడు విక్ర యించేందుకు ముందస్తుగా సిద్ధం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖల నిర్లక్ష్యమా? లేక కొందరి అండదండలతోనే ఈ అక్రమ వ్యాపారం సాగుతోందా? అనే ప్రశ్నలు వినిపిస్తు న్నాయి. అక్రమ తవ్వకాలపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు కఠిన చర్యలు తీసు కోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. స్థానిక ప్రజలు జిల్లా యంత్రాంగం, మైనింగ్,రెవెన్యూ, విజిలెన్స్ అధికా రులు వెంటనే రంగంలోకి దిగి అక్రమ కంకర నిల్వలను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేస్తున్నారు. పలాస మండలం మొగులపాడు ప్రాంతంలో కొండల విధ్వంసంపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి వసూలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546